


# నేటికి రేపొక తీరని ప్రశ్న

'కారణాలేమైనా మనిషి మార్కెట్‌తో ఒక వస్తువుగా మారాడన్నది నిజం. మనిషి ఒక వ్యాపార వస్తువైపోయిన తర్వాత మనిషి 'విలువ'ను నిర్ధారించడం, మనిషిని మనిషి అమ్మడం, కొనడం విధిగా కొనసాగే ఒక ప్రక్రియ...'

ఎందుకో కేదారి మనసులో తను ఎమ్బీఏ ఫైనలియర్‌లో ఉండగా ప్రొఫెసర్ చెప్పిన మాటలు పదేపదే చెవుల్లో గింగురుమంటూనే ఉన్నాయి.

'సుప్రీంకోర్టుకూడా ఒక వ్యాజ్యంలో నిపుణుడైన ఉద్యోగిని ఒక కంపెనీ తన బ్యాలెన్స్‌షీట్‌లో అసెట్స్ కింద చూపించుకోవచ్చని తీర్పిచ్చింది. ఆ కోణంలో చూచినపుడు 'మనిషి' అంటే వ్యాపారం. 'మనిషి' అంటే డబ్బు. మనిషియొక్క లక్ష్యం వ్యాపారం, జీవితం వ్యాపారం, సర్వంసహా మానవ జీవితగమనమంతా వ్యాపారమే...' ఇలా సాగింది ప్రొఫెసర్ చెప్పిన పాఠం ఆరోజు.

ప్రపంచీకరణ, విలువల పతనం, వ్యూహాల దండయాత్రలు, వ్యాపార దక్షతల విస్తరణ...వెరసి ఒక 'పులిజూదం' ఆట మొదలైంది భారతీయ సామాజిక వ్యవస్థలో.

పులి ఎప్పుడూ వేటాడ్తుంది...చంపుతుంది.

మేకలు ఎప్పుడూ వేటాడబడ్తాయి..చంపబడ్తాయి.

అప్పుడప్పుడు పులి మేకవన్నెలో ఉంటుంది. మేకలు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో పులుల్లా ప్రవర్తిస్తాయి. వెరసి అంతా చంపుకోవడం..చంపడం.

అసలు 'వ్యాపార'మంటే యుద్ధమా..వ్యాపారమంటే 'మోసమా'. వ్యాపారమంటే ఎప్పుడూ ఒకరు ఓడిపోవడం మరొకరు గెల్వడమా.

కేదారి మనసులో ఒక మందుపాతరవంటిదేదో నిర్విరామంగా ప్రేలుతూనే ఉంది.

'చెప్పండి మీ ఆఫర్ ఎంతో' అంటున్నాడు చైర్మన్.

ఆరోజు ఉదయం పదకొండుగంటలకు ఆ ఇంజనీరింగ్ కాలేజివాళ్ళు లెక్చరర్ ఉద్యోగం కోసం ఇంటర్వ్యూ కం డెమోకని పిలిస్తే ఒక పోస్టుకోసం ఇరవైమంది ఎమ్బిఏ అభ్యర్థులు వచ్చారు. ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఇంకెవరెవరో ఏడెనిమిదిమంది స్టాఫ్ కూర్చుని వరుసగా అందరినీ విన్నారు ఓ తరగతి గదిలో. చివరికి ఓ ఐదుగురిని ఎంపిక చేసి చైర్మన్ గదిలోకి అందరినీ పిలిపించుకుని..,

హర్రాజు మొదలైంది.

గింజలను చల్లి, పక్షులను రప్పించి చేతిలో విసరబోయే వలతో సిద్ధంగా ఉన్న వేటగాడిలా అన్నాడు చైర్మన్. 'మీ ఐదుగురిలో ఎవరైతే అతి తక్కువ జీతంతో పనిచేయడానికి ఒప్పుకుంటారో వాళ్ళు వెంటనే ఉద్యోగంలో చేరిపోవచ్చు. మీ ఒరిజినల్ సర్టిఫికేట్లను ఆఫీస్‌లో అందజేయాలి. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగమొస్తే మీరు వెళ్ళిపోవచ్చు. వేరే ఏ ఇతరకారణాల వల్లనైనా వెళ్ళిపోదల్చుకుంటే మూణ్ణెళ్ళు ముందుగా మాకు నోటీసివ్వాలి. లేకుంటే మూణ్ణెళ్ళ జీతంకట్టి సర్టిఫికేట్లు తీస్కొని వెళ్ళిపోవాలి. కనీసం ఒక్క ఏడాదైనా మాదగ్గర సర్వీస్ చేయాలి. ఇవీ కండిషన్స్.."

'అవసరం...అవసరం...అవసరం మనిషిని బానిసను చేస్తుంది' పాఠం జ్ఞాపకమొస్తోంది కేదారికి.

'వ్యాపారమంటే మనిషి అవసరాలను, అవశ్యకతలను...బలహీనతలను నగదుగా మార్చుకోవడమే'...మూలనిర్వచనం మనస్సులో నిప్పుకణికలా తళుక్కుమంది.

కేదారి 'నెలకు ఎనిమిదివేలివ్వండ్సార్' అన్నాడు..ఎంతో దిగజారి పోతున్నానని అనుకుంటూ.

క్షణంకూడా కాకముందే ఇంకొకరు 'ఏడువేల్సార్' అన్నాడు.

మరుక్షణం మరొకడు 'ఆరువేల్సార్' అన్నాడు

మనిషి తననుతాను వేలం వేసుకుంటున్నాడా..?

కొద్దిసేపు నిశ్శబ్దం తాండవించి.,

ఆమె అంది "నెలకు ఐదువేలివ్వండ్సార్' అని

మిగిలిన ఇంకొక అభ్యర్థి ఏమీ మాట్లాల్లేదు. కదిలి మౌనంగా నడిచి చేతిలోని సర్టిఫికేట్స్ ఫైల్తో బయటికి వెళ్ళిపోయాడు.

'నీ పర్సంటేజెంతమ్మా' చైర్మన్ ప్రశ్న.

'ఎనభైరెండూ పాయింట్ నాల్గుసార్' అందామె.

'ఈ దిక్కుమాలిన మార్కులన్నీ వట్టియే. మన కాలేజీలో మనమే ఇస్తున్నాంగా. మార్కులు వేరు, పర్ఫార్మెన్స్ వేరు. మంచిగా క్లాసులు తీస్కొని ప్రూవ్ చేస్కో. పర్ఫార్మెన్స్ను బట్టి ఫ్యూచరుంటది. నీపేరేంది'.

'సరస్వతి' అందామె.

'ఓకె. జాయినైపో.' చైర్మన్ లేచి హడావిడిగా వెళ్ళిపోయాడు బయటికి. ప్రిన్స్పాల్, డైరెక్టర్ ఒకరి ముఖాల్నొకరు శూన్యంగా చూచుకుని ఒక హత్యను కళ్ళారా చూచిన సాక్షుల్లా లేచారు.

కేదారి ఆమెవైపు అభావంగా చూస్తున్న ఆ క్షణం..ఆమె అంది. 'పక్షవాతమొచ్చిన తండ్రి, పండుముసలి తల్లి...ఇంతకన్నా ఏంజేయను' అని.

కేదారి తలవంచుకుని మౌనంగా బయటికి నడిచాడు. అప్పుడతనికి తన మార్కుల శాతం జ్ఞాపకమొచ్చింది. డెబ్బయ్యొనిమిది పాయింట్ ఆరు. డిస్టింక్షన్...ఆమె మార్కుల శాతమే తనకంటే ఎక్కువ. ఒంటిని జలదరింపజేసే వికృతమైన నవ్వు అతన్నావరించింది.

* * *

వర్షం...వర్షం.,

రాత్రి ఎప్పుడు మొదలైందో తెలియదు. ఉరుములు మెరుపులతో మొదలైన వర్షం..ఎడతెరపి లేకుండా..కురిసి కురిసి ముసురుగా మారి,

కేదారి....స్నానం ముగించి, శుభ్రంగా తయారై...అద్దం ముందు నిలబడి...నిన్న సాయంత్రం తెచ్చుకున్న యూనిఫాంను వేసుకున్నాడు.

ఎర్రని టీషర్ట్...నీలిరంగు ప్యాంట్...టీషర్ట్కు బ్లూ కాలర్. చాతీపై, వీపుపై ఎర్రని ఎంబ్రాయిడరీ చేసిన అక్షరాలు.

'రిలయన్స్ ఫ్రెష్'

మనుషుల మధ్య ఒక వ్యాపారత్మక ఒడంబడిక కుదిరిన తర్వాత ఎవరికైనా యూనిఫాం ఇవ్వబడ్తుంది. రాజుల కాలంలో సైనికులకు, ప్రజాస్వామ్యంలో పోలీసులకు, జైళ్ళలో ఖైదీలకు, పెట్రోల్బంక్లో బాయ్స్కు, హోటల్స్లో సర్వర్లకు, కార్పొరేట్ సంస్కృతిలో 'పనిమనుషుల'కు

పని..పని..,

డబ్బిచ్చి పనిచేయించుకునేవాడు...పనిచేసి డబ్బు తీసుకునేవాడు.

సులభ్ కాంప్లెక్స్... పే అండ్ యూజ్.

ప్రభుత్వ ఉద్యోగి...యూజ్ అండ్ పే.

తేడా ఏంటంటే...విశ్వసనీయత..ఎవరిపై ఎవరికి విశ్వసనీయత?

రూపాయి తీసుకోకుండా మూత్రం పోయనిస్తే...తర్వాత రూపాయి ఇవ్వడేమోనని భయం.

భయం...అవసరం...యివి ఎంతక కీలకమైన పదాలు.!

ముఖ్యమంత్రి మంత్రిని పిలిచి వాడుచేస్తున్న తప్పుల ఫైలు ముందుపెట్టి, భయపెట్టి బ్లాక్‌మెయిల్ చేస్తాడు...భయం...భయపెట్టడం... భయపడ్డం.

అధికారంలో ఉండడం...డబ్బు సంపాదించడం...అవినీతికరమైన పనులతో జనాన్నీ, దేశాన్నీ దోచుకోవడం అవసరం కాబట్టి ఏ రాజకీయనాయకుడైనా, అధికారైనా వింటాడు. ...

..'అవసరం',

కేదారికి తన మెడలో ఎవరో 'సోల్డ్' ట్యాగ్‌ను కట్టినట్టనిపించింది.

ఈరోజు నుండి తను 'రిలయన్స్ ఫ్రెష్' సూపర్ మార్కెట్‌లో సేల్స్‌పర్సన్...ఎమ్బీఎ...డిస్టింక్షన్...నెలకు ఐదువేల జీతం...ఉదయం ఆరున్నరనుండి సాయంత్రం నాల్గువరకు-

నవ్వొచ్చింది...తాను చదువుకున్న నిర్వాహక నైపుణ్యాల్లో 'అగత్యం' అనే పదం చప్పున స్ఫురించిందతనికి..

టైం ఆరూ పదయింది.

చకచకా బయటికొచ్చి...చిరిగిన పాత గొడుగును తీసుకుని సైకిల్ తొక్కుకుంటూ బయల్దేరాడు వేగంగా..ముసుర్లో.

ప్రొఫెసర్ చెప్పిన ఒక అతి ప్రధానమైన విషయం జ్ఞప్తికొచ్చింది కేదారికి.

'కష్టాల్లో ఉన్నపుడు, ఓటమికి చేరువలో ఉన్నపుడు తత్సంబంధమైన విషయాలగురించి సమగ్ర అధ్యయనం చేయాలి..సంయమనం పాటించాలి' అని.

వరంగల్‌లాంటి మహానగరంలో ఇరవై తొమ్మిదివేల ఆటోలున్నాయి.

అందులో పదిహేనువేలమందికిపైగా ఆటోడ్రైవర్లు పోస్ట్‌గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన వాళ్ళున్నారు. వీళ్ళందరూ 'వైట్ కాలర్' ఉద్యోగాలకోసం వెంపర్లాడుతూ కూర్చుంటే...

...పరిస్థితి ఏమిటి.

ఒక పోస్ట్‌గ్రాడ్యుయేట్ రోజుకు రెండువందల రూపాయల భృతి లభించే కూలీపనికి వెళ్ళగలడా...?

ఎందుకు వెళ్ళకూడదూ? అన్నది ప్రశ్న.

ఉద్యోగ స్వరూప స్వభావానికీ, విద్యార్హతలకూ, నైపుణ్యానికీ సంబంధం తప్పకుండా ఉండాలా?

తలనిండా..మండే అరణ్యం.

బయట వర్షం...చినుకులు చినుకులుగా, జల్లు జల్లుగా,

'రిలయన్స్ ఫ్రెష్' షాప్‌ముందు కూరగాయలను తీసుకువచ్చిన ఎసి కార్గో వాన్ ఉంది. చకచకా వెళ్ళి ఉద్యోగానికి రిపోర్ట్‌చేసి కూరగాయల క్రేటన్స్‌ను లాక్కుపోవడంలో మునిగిపోయాడు కేదారి.

....అప్పుడు...ఎడతెగని ముసురులో మొదలైన ఒక ఆత్మవివేచనతో కూడిన జీవితం అప్పుడే అంటుకున్న దీపపు వత్తిలా ఉంది.

అనుభవంతో, అధ్యయనంతో, అనుశీలనతో...సాగి సాగి.,

'ఆట నేర్చుకోవాలంటే క్రీడారంగంలోకి స్వయంగా దిగాలి. కూర్చుని ఎన్ని ఏండ్లు పరిశీలిస్తూ చూచినా ఆటరాదు'...ఎక్కడో చదివిన గుర్తు.

డిమాండ్...సప్లయ్ ఫార్ములా.

ఓట్లకోసం ప్రభుత్వాలు జనాకర్షక పథకాలను ప్రవేశపెట్టి, ప్రజలను పనిదొంగలుగా, సోమరిపోతులుగా, తాగుబోతులుగా మారుస్తున్న తరుణంలో..,

రాష్ట్రానికి ఇన్ని విచ్చలవిడి ఉన్నత విద్యాసంస్థలు అవసరమా.

ఆరువందల నలభై ఇంజినీరింగ్ కాలేజీలు ప్రతిఏటా రెండు లక్షల ముప్పయివేలమంది ఇంజినీర్స్‌ను తయారుచేస్తూ, ఏభైవేలమంది ఎమ్బీఏ, ఎమ్సీఏలను తయారిస్తూ పోతే...వీళ్ళందరినీ స్వీకరించే ఉపాధి సంస్థలేవి. ఎక్కడికి పోవాలి.

వీళ్ళంతా డిగ్రీలు, పిజీలు పొంది ఉద్యోగాల్లేక దిక్కుతోచక పిచ్చిమొగాలతో మిగిలిపోయే యువతరం మానసికంగా ఎంత కృంగిపోతుంది.

ఈ రకం యువతను డిమాండ్ కంటే ఏడెనిమిదిరెట్ల సంఖ్యలో చవగ్గా దొరికే వ్యక్తులుగా తయారుచేసి మార్కెట్‌లోకి వదుల్తే వాళ్ళ గతి ఏమిటి?

మదనపల్లిలో డిమాండ్ లేక వ్యవసాయదారులు లారీకు లారీలు టమాట ను రోడ్లపై కుమ్మరించి నిరసనను ప్రదర్శించలేదా..ఇదీ అంతేగదా. త్పాదక మానవశక్తి ఉత్పత్తి..హ్యూమన్ గార్బేజ్.

సమతుల్యతను సాధించాలంటే...డిమాండ్‌నన్నా పెంచాలి లేదా ఉత్పత్తినన్నా నియంత్రించాలి.

బొగ్గు అంటుకుంటోంది,

మంట రగులుకుంటోంది,

ఆత్మ విచక్షణ, విశ్లేషణ ఆరంభమైతే...దారులు వాటికవే ఏర్పడ్తాయి.

ఒకరోజు,

కేదారి ఊపిరి సలుపకుండా ఒకటి తర్వాత ఒకటి కస్టమర్ల 'బిల్లింగ్' చేస్తూండగా,

"మిస్టర్ కేదారీ..హౌ ఆర్ యు" అని ఓ గొంతు వినబడింది.

తలెత్తి చూస్తే...

ఎదుట తమ ప్రొఫెసర్...మౌళి సార్

అదే నవ్వు...అదే ప్రశాంతమైన చూపు...చూపులనిండా వాత్సల్యం. ఒక గొప్ప స్ఫూర్తి.

"బాగున్నాన్సార్"

"ఇక్కడ...?"

"ఔన్సార్..మీరు మా క్లాస్‌లో చెప్పారు జ్ఞాపకముందా సార్...అందరూ డిగ్రీలు, పిజీలు చేసిన తర్వాత ఉద్యోగాలు చేద్దామని బయల్దేరితే...మీకందరికీ ఉద్యోగాలనిచ్చే వాడెవడు అని. ఉద్యోగాలను అడుక్కునే స్థితినుండి ఉద్యోగాలను సృష్టించి మనకు మనం ఉపాధి కల్పించుకుని యింకో నల్గురికి ఉద్యోగాలనిచ్చే ఆలోచన మీరెందుకు చేయరు ...అని..."

"....." ప్రొఫెసర్ వింటున్నాడు మౌనంగా.

"ఇప్పుడు ఆ స్వయంనిర్మాణ క్రమంలో ఉన్నాన్సార్..ఇది అప్రెంటిస్" అంటున్నాడు కేదారి.

ప్రొఫెసర్ మౌళి ఆశఃపూర్వకంగా నవ్వి ముందుకు సాగాడు.

* * *

మరో ఐదు నెలల తర్వాత,

ఎల్లంబజార్ మార్కెట్‌లో,

ప్రతిరోజూ ఒక టన్ను చేపలను అమ్మే ఒక షాప్ గద్దెపై, ఒక ప్లాస్టిక్ కుర్చీని వేసుకుని సాదాసీదాగా కూర్చుని ఉన్నాడు కేదారి.

ఆ షాప్ అతనిదే.

'వ్యాపారం చేయాలంటే డబ్బుతో పనిలేదు. వ్యాపారంలో విజయం సాధించాలంటే ఒక మూలరహస్యం ఉంది. అది వినియోగదారునికి విశ్వసనీయతను కలిగించే గరిష్ఠ వస్తు నాణ్యత...సాధ్యమైనంత తక్కువ ధర'

నగరంలో ఒక ముద్రపడింది.

'కేదారి షాప్‌లో క్వాలిటీ చేపలు, నగరంలో అన్నిచోట్లకంటే తక్కువ ధరకు, సరియైన తూకంతో లభిస్తాయి' అని.

విజయం ఎప్పుడూ నేలను చీల్చుకుని నింగికేగిసే గంగ. పొంగడం ప్రారంభమైతే కృంగడమంటూ ఉండదు

కేదారి కళ్ళుమూసుకుని పిడికెడు జీవితాన్ని ప్రసాదించిన గురువు మౌళిసార్‌ను తల్చుకుంటున్నాడా క్షణం.

●